క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, మెట్లబావి, విశ్వనాథకాలనీ, రామాలయం, పల్లవి ఆస్పత్రి వీధి, గోవిందరాజుల గుట్ట, స్టేషన్ రోడ్డు, సీకేఎం ఆస్పత్రి, కృష్ణా కాలనీ, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, పోలవారి వీధి, డాల్ఫిన్ హోటల్, అండర్ బ్రిడ్జి, బీట్ బజార్, విజయ టవర్, మేదరి వాడ, ఫిల్టర్ బెడ్, దేశాయిపేట రోడ్డు, నిర్మలాదేవి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు వాసవిమాత జయంతి

హసన్‌పర్తి: ఈనెల 7న హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న వాసవిమాత జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. వాసవి క్లబ్, హసన్‌పర్తి సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి పురవర్ధన్, క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్, భీష్మనాథం, నాగమళ్ల సుధీర్, లక్ష్మణ్, గౌరిశెట్టి విజయ్, సతీష్, రమేష్, శంకర్, అనూప్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా గురువు బొలిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య హాజరై మెడికల్ ఆఫీసర్ ఆయూష్ డాక్టర్ మైదం రాజు, కార్పొరేటర్ గుండు చందన, డాక్టర్ రాజేశ్వరితో కలిసి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా కోచ్ తీగల రాజు, డాక్టర్ రజిత, హేమలత, మౌనిక, జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు నారాయణ పాషా, సాంబేశం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ కరీమాబాద్ రోడ్డు శాంతినగర్‌లో మహ్మద్ ముగ్దుం హైమద్, షకీల్ హైమద్, నాసర్ హైమద్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్, ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోరే మియాతో కలిసి స్థానిక కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్, అబ్దుల్, శ్రీధర్, కృష్ణ, పూజారి సంపత్, పిట్ట వీరస్వామి, పిట్ట రవీందర్, పులిశేరి నరేందర్, జగదీశ్వర్, లాల్ అహ్మద్, తజ్మాల్ హుస్సేన్, ఆస్మా శ్రీధర్ పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించుకోవాలి

హసన్‌పర్తి: తక్కువ యూరియా వినియోగించి సాగు ఖర్చు తగ్గించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. భీమారంలోని రైతు వేదికలో 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించి, నేలను సారవంతంగా ఉంచుకోవాలని అన్నారు. దుకాణదారుడి నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా నష్టం జరిగినట్లయితే ఆ రసీదుతో నష్ట పరిహారం పొందవచ్చని వివరించారు. పంట మార్పిడి పాటించాలని పేర్కొన్నారు.

బుక్ సెల్లర్స్ కార్యవర్గం ఎన్నిక



హన్మకొండ అర్బన్: బుక్ సెల్లర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కాజీపేట లక్ష్మీ బుక్ సెంటర్ నిర్వాహకుడు బోగు శ్రీధర్ ఎన్నికయ్యారు. బాలసముద్రంలోని తౌజండ్ పిల్లర్స్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సంఘం సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా అవిర్నే సతీష్‌రావు (సాయి బుక్ స్టాల్, అదాలత్), సత్యనారాయణ రెడ్డి (మెగా బుక్ స్టాల్, బాలసముద్రం), గంప సందీప్ (స్వాతిక్ బుక్ స్టాల్, హనుమకొండ చౌరస్తా), భాస్కర్ (పూర్ణిమా బుక్ స్టాల్, నయీంనగర్)ను ఎన్నుకున్నారు.

ఏకగ్రీవానికి ప్రయత్నాలు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారుల సంఘానికి చెందిన లెక్కలు పూర్తిగా చెప్పలేకనే ఏకగ్రీవానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. కమిటీ రద్దు నాటికి టెండర్ పెట్టిన సందర్భంగా వచ్చిన డబ్బులు రూ.లక్షల్లో జమ కాగా, అందులో మృతి చెందిన వారికి మొక్కుబడిగా చెల్లించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. పాత కమిటీ అప్పగించిన డబ్బులు, టెండర్లలో (ఆర్థిక సాయం అందించగా) మిగిలిన డబ్బులకు లెక్కలు చెప్పాలని వ్యాపారులు పలుమార్లు డిమాండ్ చేసినా అప్పటి కమిటీ పట్టించుకోకుండా కమిటీని రద్దు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈలెక్కలు అసంపూర్తిగా ఉండడం వల్లనే ఏకగ్రీవానికి ప్రయత్నాలు చేసినట్లు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

కిరాణా దుకాణాలు.. టెంట్ హౌస్‌లు

- రాజీవ్ యువ వికాసంలో ఈ యూనిట్లకే అధిక దరఖాస్తులు
- ఒకే రకమైన వ్యాపారముంటే మార్చాలని ఆదేశాలు
- యూనిట్ల ఎడిట్‌కు అధికారులకు అవకాశం



కాజీపేట: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. నగరంతో పాటు జిల్లాలో అనేక మంది ఒకే యూనిట్ లక్ష్యంగా దరఖాస్తులు చేసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. వారిలో అనేక మంది కిరాణా దుకాణం, టెంట్ హౌస్‌ల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒకే కాలనీకి చెందిన నిరుద్యోగ యువత ఒకే రకమైన యూనిట్లకు దరఖాస్తు చేసుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమని, దరఖాస్తుల పరిశీలన సమయంలో యూనిట్లకు మార్పునకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. మండల, మున్సిపాలిటీల పరిధిలో యూనిట్ల ఎడిట్‌కు అధికారులకు అవకాశం కల్పించారు. యూనిట్ ఆధారంగా రాయితీని అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

60పైచిలుకూ యూనిట్లకు అవకాశం

ఎక్కువశాతం మంది సొంతంగా వ్యాపారం చేసుకునేలా గాజుల దుకాణం, ఇటుకల తయారీ, డిష్ టీవీలు, సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు మరమ్మతుల దుకాణం, స్టీల్ సామాగ్రి, బేకరీలు, ఎయిర్ కూలర్లు, ఎలక్ట్రికల్ దుకాణం, మగ్గం టైలరింగ్, చెప్పుల షాపులు, పండ్ల రసాలు, జనరేటర్లు, కిరాణం, టెంట్ హౌస్, హోటల్, పేపర్ ప్లేట్ల తయారీ, మెడికల్ అండ్ జనరల్ స్టోర్, పేపర్ బ్యాగుల తయారీ, చీరలు, మిఠాయిలు, చికెన్ సెంటర్, కర్రీ పాయింట్, కూరగాయల విక్రయం ఇలా దాదాపు 60 రకాల యూనిట్లకు ప్రభుత్వం దరఖాస్తులకు అవకాశం కల్పించింది. వాటితో పాటు వ్యవసాయ రంగం, దాని అనుబంధ యూనిట్లను పేర్కొంది. వాటిలో ఏదైనా ఒక రకమైన వ్యాపారాన్ని లబ్ధిదారుడు ఎంచుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల రుణాలు వర్తింపజేయనుండటంతో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాలు కలిపి 52వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించగా అధికంగా టెంట్‌హౌజ్‌లు, కిరాణా దుకాణాల ఏర్పాటుకే మొగ్గు చూపినట్లుగా గుర్తించి యూనిట్ల మార్పులు, చేర్పులపై అధికారులు సూచనలు చేస్తున్నారు.

యూనిట్ల మార్పుతోనే లాభం

గ్రామాలు, కాలనీల్లో ఒకే రకమైన వ్యాపారాలు ముగ్గురు, నలుగురు చేస్తే ఎవరికి గిట్టుబాటు కాదు. ఎవరూ ఆర్థికంగా అంతగా లాభం పొందరు. అందుకే వేర్వేరు వ్యాపారాలు చేసుకుంటే అందరికి ప్రయోజనకరంగా ఉంటుందనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇటు మున్సిపల్ వార్డుల్లోనూ ఒకేచోట ఒకే రకమైన వ్యాపారాలు నడపకుండా అధికారులు జాగ్రత్త పడనున్నారు. ఈమేరకు క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన సమయంలో ఒకే రకమైన యూనిట్లు ఒకే ప్రాంతంలో ఉంటే మార్పులు చేసుకోవాలని వేరే యూనిట్ ఎంచుకోవాలని సూచించనున్నారు.

మార్క్సిజంతోనే సమ సమాజ స్థాపన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య

ఖిలా వరంగల్: సమాజంలో దోపిడీ, అణచివేత పోవాలన్నా, సమ సమాజం రావాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా.. అది కేవలం మార్క్సిస్ట్ సిద్ధాంతం ద్వారానే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. వరంగల్ ఉర్సుగుట్టలోని పార్టీ రామ సురేందర్ భవనంలో ఈసంపల్లి బాబు అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, కుమారస్వామి, సాంబయ్య, నమిండ్ల స్వామి, వలదాసు దుర్గయ్య, శ్రీధర్, మధుకర్, బషీర్ పాల్గొన్నారు. కారల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలను వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే.బాషుమియా, పనాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, మునీశ్వరుడు, దండు లక్ష్మణ్, ఎలేందర్, అక్బర్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న నాగయ్య, తదితరులు

ప్రపంచ గమనాన్ని మార్చిన మార్క్స్



సీపీఐ కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: శ్రమ విలువను గుర్తించి పెట్టుబడిదారీ, దోపిడీ వ్యవస్థ కుట్రలను ఎత్తిచూపి ప్రపంచ గమనాన్ని మార్చిన సిద్ధాంతం మార్క్సిజమని, ఈ సిద్ధాంత రూపకర్త కారల్‌మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కొనియాడారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో మార్క్స్ 207వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కే.భిక్షపతి, ఎల్లేష్, స్టాలిన్, ఎం.భిక్షపతి, సంతోష్, శ్రీనివాస్, రవి, శంకర్, వెంకట్రాజం, నర్సయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో మార్క్స్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర కమిటీ సభ్యులు జి.వెంకట్‌రెడ్డి, సాదుల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, చక్రపాణి, రమేష్, వీరన్న, రాములు, తిరుపతి, లింగయ్య, భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థానీలు దేశం వీడేలా చూడాలి



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తూ..



వరంగల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: పాకిస్థానీలు, బంగ్లాదేశ్ నుంచి వచ్చి అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు వెంటనే భారతదేశం విడిచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షులు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వరంగల్: పాకిస్తానీలు, బంగ్లాదేశ్ రోహింగ్యాలను గుర్తించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కాశిబుగ్గ, మట్టెవాడ, దేశాయిపేట బీజేపీ సంస్థాగత మండల అధ్యక్షులు రజనీష్‌నేత, సీత నాగరాజు, విప్ప సుధాకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి నాయబ్ తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, గడల కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌కు సన్మానం



ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ (గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్)గా నియమితులైన దయాశీలను ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం, ఎంజీఎం బ్రాంచ్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఎంజీఎం బ్రాంచ్ ప్రతినిధులు ప్రీతిసజిని, సరళాదేవి, సల్మా, అపర్ణ, నర్సింగ్ ఆఫీసర్లు, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చేయూత



రామన్నపేట: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితమైన నగరంలోని రామన్నపేటకు చెందిన కందిమల్ల మాధవికి వీల్ చైర్, 50 కిలోల బియ్యం, రూ.10 వేల నగదును ఫెడరేషన్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు మధు, గుమ్మడవెల్లి సురేష్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్‌బాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు శైలజ, ఉపాధ్యక్షుడు మంచాల విజయ్, బాధ్యులు శశిధర్, అనిల్, సందీప్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థల పరిశీలన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని విద్యుత్ శాఖ రూరల్ డీఈఈ శామ్యానాయక్, ఏడీఈ అశోక్ కుమార్ సోమవారం పరిశీలించారు. నాలుగేళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, రెవెన్యూ అధికారుల జాప్యం కారణంగా స్థల సేకరణ జరగలేదు. స్థానికుల విజ్ఞప్తి మేరకు తహసీల్దార్ చల్లా ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని మిషన్ భగీరథ కార్యాలయం వద్ద 20 గుంటల భూమిని కేటాయించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్‌కుమార్, ఏఈ శిరీష్, దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, పెద్దమ్మ నర్సింహారాములు, బల్సుకూరి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, దేవస్థాన ధర్మకర్త సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

భారత రాజ్యాంగ పరిరక్షణకే ర్యాలీలు



దేశాయిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దేశాయిపేట / ఖిలా వరంగల్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు నవీన్‌రాజ్, పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ కోరారు. దేశాయిపేట బొడ్రాయి జంక్షన్ వద్ద సోమవారం ప్రారంభమైన యాత్ర.. 12, 13, 22వ డివిజన్లలో సాగింది. పీసీసీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, కంకల సదానందం, వేణుగోపాల్, జె.రమేష్, టీ.వేణు, మడిపల్లి కృష్ణ, కరుణాకర్, శ్రీధర్, రామకృష్ణ, మబ్బు ప్రవీణ్, కార్పొరేటర్లు కావేటి కవిత, సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వస్కుల బాబు, ఓని స్వర్ణలత, బోగి సువర్ణ, బైరబోయిన ఉమ, ముష్కమల్ల అరుణ, పల్లం పద్మ పాల్గొన్నారు.

జస్టిస్ ఎంజీ ప్రియదర్శినికి నివాళి



మాట్లాడుతున్న న్యాయవాది

వరంగల్ లీగల్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని హఠాన్మరణానికి సంతాపంగా హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ అట్టడుగు సామాజిక వర్గం నుంచి ఎదిగిన జస్టిస్ ప్రియదర్శిని.. బాధితులకు ఆమె చేసిన న్యాయ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వలుస సుధీర్, రమాకాంత్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, బార్ కౌన్సిల్ సభ్యుడు బైరపాక జయాకర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు పహల్గాం మృతులకు శాంతి ర్యాలీ

వరంగల్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన అమరవీరులతో పాటు రాజమండ్రిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థం ఈనెల 7వ తేదీన గ్రేటర్ క్రిస్టియన్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ర్యాలీ నిర్వాహకుడు కె.అశోక్‌పాల్ తెలిపారు. కాశిబుగ్గలోని చర్చిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సంఘ అధ్యక్షులు ప్రవీణ్, అబ్రహాం, బోడ డిన్నా, ఫ్రాంక్లిన్ సుధాకర్, సర్వేష్, పోలెపాక సీతయ్య, పావని, సందెల లాజర్, కిరణ్, భాషపాక ఏలియా పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: జమ్మూకశ్మీర్ పహల్గాం ఘటనతో పాటు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాప సూచకంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు బుధవారం ఉదయం 8 గంటలకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు బిషప్ డానియల్ కల్యాణపు తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాంతి ర్యాలీ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.



పత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

పదో తరగతి టాపర్లకు సన్మానం



కాజీపేట: విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



హసన్‌పర్తి: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాజీపేట: 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. 539 మార్కులతో కాజీపేట మండల టాపర్‌గా నిలిచిన మేరుగు మానసను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు కె.శోభ ప్రత్యేకంగా అభినందించారు.

హసన్‌పర్తి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను పాఠశాలలో సోమవారం అభినందించారు. విద్యార్థులు అనుదీప్, ధనుష్, కె.శివశంకర్, వరప్రసాద్‌ను ఉపాధ్యాయులు, స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీదేవి, రాణి, సంయుక్తదేవి, తిరుపతి, ఉషారాణి, మస్రత్, ఖదీర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చర్చలు జరిపే ప్రసక్తే లేదనడం దుర్మార్గం

వరంగల్: మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదనడం దుర్మార్గమని, కేంద్రం నిరంకుశ వైఖరి విడనాడి శాంతి చర్చలు జరపాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో సూచించారు. కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని అనేక రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు డిమాండ్ చేస్తుంటే మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రకటించడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు.

సిబిల్ స్కోర్ విధానాన్ని ఎత్తివేయాలి

హన్మకొండ: రాజీవ్ యువ వికాస పథకం అమలుకు సిబిల్ స్కోర్ విధానాన్ని ఎత్తి వేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. పథకాన్ని సిబిల్ స్కోరు ఆధారంగా అమలు చేయడం ద్వారా పేద దళిత కుటుంబాలకు ఇది అందని ద్రాక్షగా మారుతుందని, సిబిల్ స్కోర్ విధానాన్ని ఎత్తివేసి, బ్యాంక్ లింకేజ్ లేకుండా రుణాలు ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఇప్పుడు సిబిల్ స్కోర్‌ను రాజీవ్ యువ వికాస పథకానికి అర్హతగా పరిగణిస్తే దాదాపు 40 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ కోరారు. మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు, కళలు, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర అంశాల్లో విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. కార్పొరేటర్ తేజస్విశిరీష్, పాఠశాల హెచ్ఎం, జిల్లా విద్యాశాఖ ఏసీజీఈ కె.అరుణ, వరంగల్ ఎంఈఓ గంపా అశోక్, ఉపాధ్యాయులు శౌకత్ అలీ, భిక్షపతి, వనం కిరణ్‌కుమార్, దేవులపల్లి కిరణ్‌కుమార్, రమేశ్, చంద్రకళ, ప్రభాకర్, రాజు, యాస్మిన్, కవిత, రాహుల్ పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

కాజీపేట: ఉదయం వాకింగ్ కోసం బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం హైదరాబాద్ నాగోల్ ప్రాంతానికి చెందిన మండలోజు వెంకటేశ్వర్లు (70) దర్గా కాజీపేటలో ఉంటున్న తన కూతురు ఇంటికి వచ్చాడు. సుమారు 20 రోజులుగా ఇక్కడే ఉంటున్న వెంకటేశ్వర్లు.. సోమవారం ఉదయం బయటకు వెళ్లి ఇంటికి చేరుకోకపోవడంతో వెంకటేశ్వర్లు అల్లుడు ముదుపు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామన్నపేట: ఎంజీఎం ఆస్పత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. ఈనెల 1న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స కోసం ఆస్పత్రిలో చేరి 4వ తేదీన మృతి చెందాడని పేర్కొన్నారు. వివరాలకు 87126 85005, 87126 85091 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామ శివారులోని రింగ్‌రోడ్డు అండర్ పాస్ వద్ద సోమవారం వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన పెసరు ఆగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన భార్య పెసరు అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ తెలిపారు.

బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు

ఖిలా వరంగల్: జర్నలిస్టు పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. కుమార్, తుమ్మ వివేక్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు మహేందర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

కాజీపేట: శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ వైదిక పరిపాలన నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వ్రతంలో 108 జంటలు పాల్గొన్నాయి. సత్యనారాయణ స్వామి పరివార దేవతలకు పంచామృతాలతో సంప్రోక్షణాభిషేకాన్ని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

హసన్‌పర్తి: రేణుకాఎల్లమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, నాయకులు రాజు, సాయి, సుమన్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం మరువలేనిది



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: ఆత్మీయ సమ్మేళనాన్ని ఎన్నటికీ మరువబోమని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణదేవరాయులు అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలోని జిల్లా పరిషత్ పాఠశాల 1974 - 75వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భీమారంలోని వీఆర్. కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, నల్సార్ యూనివర్సిటీ (హైదరాబాద్) వైస్ చాన్సలర్ కృష్ణదేవరాయులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వ్యాపారవేత్త మామిడాల సురేందర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన హర్షణీయం

ఖిలా వరంగల్: దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్ర నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటిదని, కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. శివనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన వలన వెనుకబడిన వారికి రిజర్వేషన్లను అమలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

గాలులతో రాళ్ల వర్షం

ఖిలా వరంగల్: వరంగల్ నగరంతోపాటు అండర్ బ్రిడ్జి ఏరియాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన రాళ్ల వర్షం కురుసింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచి నగరం మొత్తం చీకటిమయమైంది. అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగల మీద పడ్డాయి. విద్యుత్ నిలిచిపోవడంతో వీధుల్లో చీకటి అలుముకుంది.